క్లుప్తంగా

ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి సహకరించండి



దేవదాయశాఖ ఏసీతో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

కర్నూలు కల్చరల్: జగన్నాథ గట్టు మాన్యం భూమిలో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి సహకరించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. మంగళవారం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, జిల్లా సహ కార్యదర్శులు గోవింద రాజులు, గిరిబాబు, ఈపురి నాగరాజు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్ రెడ్డిని కలిసి లీజ్ అగ్రిమెంట్ గురించి చర్చించారు. జగన్నాథ గట్టు భూమిని ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి కేటాయిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయని, అయితే, వాటిని ఎగ్జిక్యూట్ చేసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని అభ్యర్థించారు.

జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లు నిర్మించాలి



సర్వీసు రోడ్డు లేని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారి 40లో భాగంగా బళ్లారి చౌరస్తా నుంచి కృష్ణానగర్ వరకు సర్వీసు రోడ్లను నిర్మించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఇ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జాతీయ రహదారి వెంబడి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సర్వీసు రోడ్లు లేకపోవడంతో నాలుగు లేన్లలో వెళ్తున్న వాహనాలను రెండు లేన్లలో పంపుతున్నారన్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్‌తో నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సీవీ వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.రమణగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

30న రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్ లోగోను ఆవిష్కరించిన ఈఎస్‌టీ నిర్వాహకులు

కర్నూలు (టౌన్) : ఈనెల 30 వ తేదీ నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఎస్‌టీ (ఈవాంజిలికల్ సోల్జర్స్ టీమ్) చైర్మన్ సజీవరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సి. క్యాంపు ప్రార్థన మందిరంలో సిటీ పాస్టర్స్ అసోసియేషన్ సహకారంతో రన్ ఫర్ జీసస్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐక్యతతో మెలిగి ఏసుక్రీస్తు మరణ పునరుద్ధానం చాటాలని పిలుపు నిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక రాక్‌వుడ్ చర్చి నుంచి ప్రారంభమై సి.క్యాంపు ప్రార్థన మందిరం వరకు రన్ ఫర్ జీసస్ పేరుతో పరుగు ఉంటుందని తెలిపారు. నగర క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ దాసరి సుధీర్, రాజేంద్రప్రసాద్, జయకార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. మంగళవారం సుర్జీత్ భవన్‌లో మండి బజార్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీ, దాని మిత్రులైన టీడీపీ,జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో 2014 నుంచి మోదీ నియంతృత్వంతో పాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించి అంబానీ, అదానీలను ప్రపంచ కుబేరులను చేస్తున్నారన్నారు. పేదవాడు మాత్రం నేటికి కూటికోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, సాయి, జహంగీర్, రియాజ్, బషీర్, వెంకటేష్, లాలు మోజెస్, సయ్యద్ పాల్గొన్నారు.

మెరుగైన సాధనతో పతకాలు

కర్నూలు (టౌన్): క్రీడల్లో మెరుగైన సాధనతో పతకాలు సాధించొచ్చని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 31 వరకు చిత్తూరు జిల్లా తిరుపతి పట్టణంలోని శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-19, విభాగాల్లో ప్రతిభ చాటాలన్నారు. ఇన్‌లైన్, క్వాడ్ స్కేటింగ్, రింక్‌రేస్, రోడ్ రేస్‌లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్కేటింగ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

- ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయండి
- ఓటర్ల అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ సృజన



కల్లూరు అర్బన్‌లో చేపట్టిన ఓటరు అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య

కర్నూలు: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలో మంగళవారం ఉదయం ఓటర్ల అవగాహన ర్యాలీ జరిగింది. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా ఓటర్లను భయపెట్టినా, ప్రలోభపెట్టినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా, శాంతి భద్రతలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ విజయ శేఖర్, కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో కవాతు...

ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు దేవనకొండ యూపీఎస్ సీఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెర్నెకల్లు, నేలతలమర్రి, గుండ్లకొండ గ్రామాల్లో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ముగితి, నందవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఓటు..ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం

కల్లూరు: ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, దీనిని ప్రతి ఓటరు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్‌లోన్ని ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఆటో స్టాండ్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి వారు పాల్గొన్నారు. ముజఫర్ నగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలోని 112, 113, 114, 115, 116, 117 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాక పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, డీఎస్పీ విజయ శేఖర్, మెప్మా పీడీ నాగ శివలీల, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం మన బాధ్యత

కర్నూలు (టౌన్) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వినియోగం మనందరి బాధ్యత అని కర్నూలు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం ఓటు హక్కు వినియోగంపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మున్సిపల్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌నగర్, రోజా దర్గా, రాధాక్రిష్ణ ఆసుపత్రి, మోడరన్ ఫంక్షన్ హాలు, అంబికా శిశు కేంద్రం, టంగుటూరు ప్రకాశం పంతులు స్మారక నగరపాలక పాఠశాల, మదర్ థెరిస్సా కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య, స్పెషల్ ఆఫీసర్ మన్సూర్ బాషా, మెప్మా సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికలకు నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రచారలకు అనుమతి తప్పని సరి అని, ఈ నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభలు, సమావేశాలకు 48 గంటలకు ముందే అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులు ఉపయోగించే వాహనాలకు తప్పకుండా పాస్‌లు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేసే పోస్టింగ్‌లపై జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతులు పొందిన తరువాత ప్రచురించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

నేడు పెంటాథ్లాన్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 బాల బాలికలకు మోడరన్ పెంటాథ్లాన్ ఎంపిక పోటీలు నేడు (బుధవారం)నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న 67 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మోడరన్ పెంటాథ్లాన్ క్రీడాంశంలో 1200 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

9న ఉగాది ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ఏప్రిల్ 9వ తేదీన ఉగాది పర్వదినాన్ని జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. ప్రకృతి సమ్మతమైన నూతన సంవత్సర పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిపైన ధర్మ ధ్వజాన్ని ఎగరవేయాలని, బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుదామని, సాయంత్రం ఇంటి ముందర ఐదు దీపాలు వెలిగించాలని, దేవాలయాల్లో సామూహిక హారతిని నిర్వహించాలని సూచించారు.

మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ప్రాంతీయ శిక్షణా కేంద్రం(ఫిమేల్)లో ఎంఎల్‌హెచ్(సీహెచ్‌వో)లకు ఫ్యామిలీ కేర్ టీచింగ్ విధానంపై నూరా హెల్త్ అనే ఎన్‌జీవో వారిచే, కేర్ కంపానియన్ ప్రోగ్రామ్ వారి సమన్వయంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ సేవలు, అసంక్రమిత వ్యాధుల నివారణ సేవలు బలోపేతంలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు నాలుగు రకాల ఫ్లిప్ బుక్‌లను(గర్భిణి ఆరోగ్యం, బాలింతల ఆరోగ్యం, పిల్లల, కౌమారుల ఆరోగ్యం, అసంక్రమిత వ్యాధులపై అవగాహన) ఇచ్చి వాటిని ఉపయోగించే విధానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలు వారి దినచర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీనివల్ల మాతాశిశు సంరక్షణ సేవలైన 12 వారాల్లో గర్భిణి నమోదు, ప్రమాదకర గర్భిణిలను గుర్తించి చికిత్సలు అందించడం, సమయానుసార రెఫరల్ సేవలు, పిల్లలు, కౌమారుల ఆరోగ్య సంరక్షణ, అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రజలకు అందడం వల్ల మాతాశిశు మరణాల నివారణ, అసంక్రమిత వ్యాధుల నివారణకు దోహదం మవుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే డీసీ డాక్టర్ శైలేష్‌కుమార్, కేర్ కంపానియన్ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ శివశంకర్, డెమో ప్రమీలాదేవి, డీపీవో విజయరాజు, హెచ్‌ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సి.బెళగల్, గార్గేయపురం, ఇ. తాండ్రపాడు, ఉలిందకొండ పీహెచ్‌సీ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌వో)లు పాల్గొన్నారు.

పచ్చ మీడియా కథనాలను ప్రజలు నమ్మరు

- మూడోసారి కర్నూలులో వైఎస్‌ఆర్‌సీపీ జెండా ఎగురవేస్తాం
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : '2019 సంవత్సరంలో పచ్చ మీడియా వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ మీద, అభ్యర్థులపై ఇష్టానుసారంగా కథనాలు రాసింది. చివరకు ఏమైంది. వైఎస్‌ఆర్ సీపీనే ఘన విజయం సాధించింది. ఇప్పుడు కూడా ఆ పచ్చమీడియా అవే పిచ్చి రాతలు రాస్తోంది. పార్టీలో విభేదాలంటూ దుష్ప్రచారం చేస్తోంది. అయినా, ఆ ఎల్లో మీడియా కథనాలను ప్రజలెవ్వరూ నమ్మరు. రానున్న ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఘన విజయం సాధిస్తారు. కర్నూలు కొండారెడ్డిబురుజుపై మూడవ సారి వైఎస్‌ఆర్‌సీపీ జెండా రెపరెపలాడుతుంద'ని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి పచ్చ పత్రికల్లో వచ్చిన కథనాలను ఖండించారు. మైక్ విసిరేశానని, మాజీ ఎమ్మెల్యేతో విభేదాలు ఉన్నాయని ఇష్టాను సారంగా రాయడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీలో విభేదాలు ఉన్నట్లు ఎల్లో మీడియా ఊహించి వార్తలు రాస్తుందన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తోందన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఎన్ని కుట్రలు పన్నినా కర్నూలు వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్‌ను అందరం కలిసి గెలిపించుకుంటామని చెప్పారు. తెలుగుదేశం పార్టీని బతికించుకోవడంపై ఎల్లోమీడియా దృష్టి సారించాలని హితవు పలికారు.

మద్యం మత్తులో వీరంగం

కర్నూలు : స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఒకరు, వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. కిసాన్ ఘాట్ వద్ద మంగళవారం ఉదయం యువకుడు ఫుల్‌గా మద్యం తాగి పెద్దపెద్ద బండరాళ్లు రోడ్డుపైకి విసురుతూ వీరంగం సృష్టించడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. ఆనంద్ టాకీస్ వైపు నుంచి హంద్రీ బ్రిడ్జి మీదుగా కిసాన్‌ఘాట్ రోడ్డు గుండా ఉడ్‌ల్యాండ్ సర్కిల్ వైపు వెళ్లే వాహనదారులు సుమారు అరగంట పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు కొంతమంది ధైర్యం చేసి మద్యం మత్తులో ఉన్న యువకుడిని అక్కడి నుంచి వెళ్లగొట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించడమే కాక ఒంగోలు నుంచి కర్నూలు వైపు వస్తున్న ఆదోని డిపోకు చెందిన బస్సుపై రాళ్లు రువ్వడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కండక్టర్‌కు రాళ్లు తగిలి గాయాలు కావడంతో ప్రయాణికులు సమయస్ఫూర్తితో స్పందించి మద్యం మత్తులో ఉన్న యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వాహనదారులతో పాటు దేవాలయానికి మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు కూడా మద్యం బాబుల వీరంగం వల్ల ఇబ్బందులు పడ్డారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

ఓర్వకల్లు: కాల్వ గ్రామంలో అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో గుంటూరు జిల్లా కాకనూరు మండలం, కొండవారిపాలెంకు చెందిన జీపీ చౌదరి వృషభాలు నిర్ణీత సమయానికి 3100 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలువగా రూ.50 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడు వృషభాలు 2900 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.40 వేలు దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా కొండవారి పాలెం జీపీ చౌదరి రెండో జత 2400 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా, చాగంటి నాగేశ్వరరావు (సీఎస్‌ఆర్) వృషభాలు 2,325 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.20 వేలు, కర్నూలు మండలం రుద్రవరం ఎల్లగౌడు ఎద్దు ఐదో బహుమతి రూ.10 వేలు గెలుచుకున్నట్లు సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు.

'నాపై ఎలాంటి దాడి జరగలేదు'

కర్నూలు సిటీ: తనపై దాడి చేసినట్లు, కిడ్నాప్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నగరంలోని రోజా వీధికి చెందిన సయ్యద్ జిలానీబాషా ఖాద్రీ తెలిపారు. కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అనుచరుల పాత్ర ఉందన్నది కూడా అవాస్తవమని మంగళవారం ప్రకటనలో వెల్లడించారు.

పెద్దాసుపత్రిలో త్వరలో పూర్తిస్థాయి ఈ-హాస్పిటల్



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో పూర్తిస్థాయి ఈ-హాస్పిటల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన యూహెచ్‌ఐడీ 11 అంకెల నెంబర్ కేస్‌షీట్, వైద్యపరీక్షల నివేదికలను సక్రమంగా నిర్వహించాలని హెచ్‌ఓడీలకు చెప్పారు. అన్ని విభాగాల్లో రోగులకు సంబంధించిన వివరాలు ఎక్సెల్ షీట్‌లో డేటాను ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ , న్యూరాలజీ, డెర్మటాలజీ విభాగాలకు ఆరోగ్యశ్రీ నెలవారీ లక్ష్యాలను పెంచుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, పల్మనాలజీ, ఫ్యామిలీ ప్లానింగ్, ఐడీ విభాగంలలో ఈ-హాస్పిటల్‌ను వంద శాతం అమలు చేయాలని చెప్పారు. ఇతర విభాగాల్లోనూ ఈ-హాస్పిటల్‌ను మరింత బాగా చేయాలని సూచించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

క్షేత్ర పాలకుడికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కర్నూలు కల్చరల్ : నగర శివారులోని గోదా గోకులంలో క్షేత్ర పాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీ రామభక్త హనుమంతుడికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తీర్థగోష్ఠి, 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా, 11 పర్యాయాలు శ్రీ రామరక్షా స్తోత్ర పారాయణం, మహాజన సంకల్పం, పంచామృతాభిషేకం, అష్టోత్తరం, విశేషాలంకరణ, మహా మంగళ హారతి, భక్తాదులందరికీ మహాప్రసాద వితరణ జరిగింది. వేద పండితులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఇందిర దంపతులను వేదాశీర్వచనంతో ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజుతో పాటు గోదా గోకులం సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ లీకేజీ

- రెండు రోజులుగా సాగుతున్న మరమ్మతు పనులు
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ విజ్ఞప్తి



నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు పనుల వల్ల ఒకవైపు మూసివేసిన రోడ్డు

కర్నూలు : స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షాప్ దగ్గర నీటి సరఫరా చేసే మెయిన్ పైప్‌లైన్ లీకేజీ అయింది. మరమ్మతు పనుల్లో భాగంగా జేసీబీలతో లీకేజీ ప్రాంతాన్ని తవ్వేసి మట్టిని రోడ్డుపై వేయడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమస్యను అర్థం చేసుకుని వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ గౌతమి విజ్ఞప్తి చేశారు.

భారీ వాహనాలు మళ్లింపు...

నంద్యాల, ఆత్మకూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంకు మీదుగా రింగ్ రోడ్డుపై నుంచి వెళ్లే విధంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు, నంద్యాల వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు, లారీలను నంద్యాల చెక్‌పోస్టు వద్ద నుంచి తాండ్రపాడు మీదుగా రింగ్ రోడ్డు వైపు మళ్లిస్తున్నారు. దీనివల్ల నగరంలోకి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి టెలికాం నగర్ వరకు ఒక వైపు రోడ్డును బారీకేడ్లతో మూసివేసి రెండో వైపున మధ్యలో బారీకేడ్లతో టూ వే ఏర్పాటు చేసి ఆటోలు, కార్లు, ఇతర చిన్న వాహనాలు వెళ్లేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా వాటర్‌పైప్‌లైన్ మరమ్మతు పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యే వరకు నగరంలోకి బస్సుల రాకపోకలపై నిషేధం విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

టీడీపీ కోడుమూరు అభ్యర్థి కోడ్ ఉల్లంఘన

- సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన న్యాయవాది ఎం.ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేస్తుండడంతో వైఎస్‌ఆర్‌సీపీ లీగల్ సెల్ రిటర్నింగ్ ఆఫీసర్/ఆర్డీఓ ఎం.శేషిరెడ్డికి ఫిర్యాదు చేసింది. ఈనెల 24వ తేదీన బొగ్గుల దస్తగిరి కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడులో చర్చిలో పార్టీ కండువా కప్పుకొని వచ్చిన భక్తులను ఓట్లు అడిగారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి, ఆంధ్ర ప్రభ పత్రికలు ప్రచురించడంతో సీవిజిల్ యాప్‌తోపాటు కోడుమూరు ఆర్‌ఓకు నేరుగా ఫిర్యాదు చేసినట్లు వైఎస్‌ఆర్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్, న్యాయవాది ఎం.ప్రభాకర్ తెలిపారు. దీంతో ఎన్నికల సంఘం అధికారులు పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

పేదల అభ్యున్నతికి కృషి

- ఐదేళ్ల వైఎస్‌ఆర్‌సీపీ పాలనే అందుకు నిదర్శనం
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని
- పలువురు వైఎస్‌ఆర్‌సీపీలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని, అందుకు ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనే నిదర్శనమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ టీడీపీ మరింత బలహీన పడుతోందన్నారు. మంగళవారం కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనతో రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దొడ్డిపాడు గ్రామానికి చెందిన చిన్న, హుస్సేన్‌మియ్య, రాజు, గోవిందు, సోమన్న, కాశింవలి, సుభాన్, మిస్నేక్ష, చాంద్‌బాషా, శాంతి, జూలక్క, రాణేమ్మ, రమిజాబీ, మాసుంబీ, రామాంజనమ్మ, ప్రమీలమ్మ, మహాలక్ష్మి, ఫాతిమా తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మునిస్వామి, నాయకులు హనుమంతురెడ్డి,చంద్రారెడ్డి, మహేష్, మన్సూర్ అలీ, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: హుసేనాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌లాల్‌తో పాటు మరో 10 వైఎస్‌ఆర్‌సీపీ కుటుంబాలను గ్రామ టీడీపీ నాయకుడు మల్లెల రాజశేఖర్ ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా ఇటీవల పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమక్షంలో టీడీపీలో చేర్పించారు. అయితే, ఆ పార్టీ సిద్ధాంతాలు, నాయకుల తీరు నచ్చక వారంతా తిరిగి మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్‌ఆర్‌సీపీలోకి వచ్చారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు నాగతిరుపాలు, చిన్న అయ్యన్న, లోటర్‌బాషా పాల్గొన్నారు.

మసీదులో ఇంతియాజ్ ప్రత్యేక ప్రార్థనలు

కర్నూలు (టౌన్): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నగరంలోని స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మస్జీద్-ఎ- అమీరుద్దీన్‌లో వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్.. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కర్నూలు పార్లమెంటు అభ్యర్థి బీవై రామ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. తర్వాత ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తారు విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందులో వైఎస్‌ఆర్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య →

